సాక్షి
సిద్దిపేట

సోమవారం । 31 । జూలై । 2023



కాటు వేసే కాలం

వర్షాకాలంలో విషసర్పాలు, పురుగులు సంచారం అధికంగా ఉంటోంది. పొలాల వద్దకు వెళ్లే రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. 8లో..



చినుకుపడితే అంతే..

బెజ్జంకి మండలంలోని తోటపల్లి హరీశ్‌రావు కాలనీ ప్రజలు ఏటా వరద నీటితో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోజుల తరబడి నీరు నిలవడంతో నడవలేని పరిస్థితి ఉంది. 9లో..



అడుగుకో గుంత

గజ్వేల్ నుంచి కోమటిబండ వెళ్లే రోడ్డుపై పలుచోట్ల భారీ గుంతలు ఏర్పడ్డాయి. అందులో వర్షం నీరు నిలవడంతో వాహ నదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 9లో..

న్యూస్‌రీల్

కక్ష సాధింపు వద్దు



మాట్లాడుతున్న మల్లికార్జున్‌రెడ్డి

హుస్నాబాద్: గ్రామ పంచాయతీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ 25రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం చర్చలకు పిలవకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని సంఘం గౌరవ అధ్యక్షుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో కార్మికుల సమ్మె శిబిరాన్ని సందర్శించి ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో పంచాయతీ కార్మికులు చేసిన పోరాటం మరువలేనిదని గుర్తు చేశారు. కార్యక్రమంలో దుర్గయ్య, సదానందం, వెంకటేష్, అనిల్, మహేందర్, తిరుమల, నర్సవ్వ తదితరులు ఉన్నారు.

ఆరుతడి పంటలు లాభదాయకం



స్ప్రింక్లర్ సెట్‌లు అందజేస్తున్న రాధాకృష్ణశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): రైతులు ఆరుతడి పంటలు సాగు చేసి లాభాలు పొందాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణశర్మ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చంద్లాపూర్‌లో 48 మంది రైతులకు సబ్సిడీపై స్ప్రింక్లర్ సెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి హరీశ్‌రావు చొరవతో మండలంలో 8 వేల స్ప్రింక్లర్ సెట్‌లు అందించామని తెలిపారు. వరి పంటతోపాటు కూరగాయలు, ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షులు పాపయ్య, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, సర్పంచ్‌లు ఉమేష్‌చంద్ర, చంద్రకళ రవి, బాబు, ఎంపీటీసీ దుర్గారెడ్డి, రవీందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా ట్రస్మా నూతన పాలకవర్గం



మల్లారెడ్డిని సన్మానిస్తున్న ట్రస్మా సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా ట్రస్మా (తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) నూతన పాలకవర్గం ఎన్నిక ఆదివారం పట్టణంలో నిర్వహించారు. ఆ సంఘం నూతన అధ్యక్షుడిగా జగ్గు మల్లారెడ్డి ఐదోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా గోవిందారం సంపత్ కుమార్, కోశాధికారిగా పబ్బతి భగవాన్ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా కృష్ణమాచారి, వైస్ ప్రెసిడెంట్‌గా మిద్దె రమేష్, ఘనగోని శ్రీకాంత్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని అన్నారు. ప్రైవేట్ టీచర్లకు హెల్త్ కార్డు, డబుల్ బెడ్ రూంలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా ఎన్నికల అధికారి హనుమంతరెడ్డి, సత్యం, సంతోష్‌కుమార్, మహ్మద్ సికిందర్, రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు అండగా కాంగ్రెస్



మాట్లాడుతున్న సాజిద్‌బేగ్

వర్గల్(గజ్వేల్): భూనిర్వాసితులకు కాంగ్రెస్ అండగా నిలిచి పోరాటం చేస్తుందని పార్టీ లీగల్‌సెల్ నేత, హైకోర్టు న్యాయవాది సాజిద్ బేగ్ అన్నారు. మండల పరిధిలోని అవుసులోనిపల్లి వద్ద న్యాయపరమైన పరిహారం కోసం భూనిర్వాసితులు చేస్తున్న దీక్ష ఆదివారం 38వ రోజుకు చేరుకుంది. దీనికి ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. భూనిర్వాసితుల ఆందోళనకు ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. వర్గల్ పరిధిలో స్టే కొనసాగుతున్న భూముల్లో పరిశ్రమల శాఖ పనులు చేపడుతుందని ఆరోపించారు. బాధితులతో కలిసి సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోహన్, భూనిర్వాసితుడు, మాజీ ఎంపీటీసీ గుర్రాల యాదయ్య, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, నందు, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

చెత్తశుద్ధి ఏదీ?

- మున్సిపాలిటీల్లో అధ్వానంగా పారిశుద్ధ్య నిర్వహణ
- సిద్దిపేట మినహా అన్నిచోట్ల డంపింగ్ ఇబ్బందులు
- కనిపించని తడి, పొడి వేరుచేసే ప్రక్రియ
- పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు

మున్సిపాలిటీలను చెత్త సమస్య వేధిస్తోంది. డంపింగ్ యార్డులు లేక ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది, చెత్త సేకరణ వాహనాలు సరిపడా లేక కాలనీలన్ని కంపు కొడుతున్నాయి. వర్షాకాలం సీజన్ కావడంతో సరైన పారిశుద్ధ్య నిర్వహణ లేక వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది.



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త

గజ్వేల్: జిల్లాలోని మున్సిపాలిటీల్లో చెత్త సేకరణ, డంపింగ్ ఇష్టారాజ్యంగా సాగుతోంది. సిద్దిపేట మినహా ఎక్కడా ఈ ప్రక్రియ సక్రమంగా సాగటం లేదు. గజ్వేల్‌లో డంపింగ్ యార్డు పనులు పూర్తి కావొస్తున్నా... తడి, పొడి చెత్తను వేరు చేయడం, కంపోస్టు తయారీ సక్రమంగా సాగటం లేదు. హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాలలో ఈ పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక పట్టణాలు 2012లో మున్సిపాలిటీలుగా ఆవిర్భవించాయి. చేర్యాల నాలుగేళ్ల క్రితం బల్దియాగా మారా్చరు. అప్‌గ్రేడ్ అయిన తర్వాత ఆయా పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగవుతుందని అంతా భావించారు. కానీ పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. ప్రధానంగా డంపింగ్ యార్డులకు స్థలాల కొరత ఉంది. దీంతో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడంతో కాలనీలు కంపు కొడుతున్నాయి.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీగా ఆవిర్భవించిన తర్వాత ముట్రాజ్‌పల్లి, క్యాసారం గ్రామ పంచాయతీలు విలీనమయ్యాయి. ప్రస్తుతం మున్సిపల్ పరిధిలో 15వేల ఇళ్లు, 80వేలకు పైగా జనాభా ఉంది. ఇక్కడ నిత్యం 20మెట్రిక్ టన్నుల పైగా చెత్త ఉత్పత్తి అవుతుంది. పట్టణంలోని నల్లవాగుగడ్డ సమీపంలో జరుగుతున్న డంపింగ్ యార్డు నిర్మాణ పనులు పూర్తి కావొస్తున్నాయి. యార్డు కోసం సర్వే నంబర్ 25లోని ప్రభుత్వ భూమిలో 19 ఎకరాలను కేటాయించారు. 9ఎకరాలు డంపింగ్‌యార్డు, 2ఎకరాలు స్లాటర్ హౌస్(పశు వధశాల), మిగితా ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో రెండు డంపింగ్ యార్డులు నిర్మించాల్సి ఉండగా, ఒకటి మాత్రమే నిర్మించారు. పట్టణంలో దాదాపు 30వేల జనాభా, 6500 ఇళ్లు ఉన్నాయి. ప్రతీరోజు దాదాపు 11మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. ఒకటే యార్డు సరిపోక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలో 28వేల జనాభా, 7వేల ఇళ్లు ఉన్నాయి. ఇక్కడ నిత్యం 4.25మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. దీనిని తరలించడానికి డంపింగ్ యార్డు లేక రోడ్లపై, జనసంచార ప్రదేశాల్లో పడేస్తున్నారు. చేర్యాల మున్సిపాలిటీలోనూ ఇదే రకమైన పరిస్థితి. చెత్త సేకరణకు పారిశుద్ధ్య సిబ్బంది, వాహనాలు సరిపోను లేక సమస్యగా మారింది.

కనబడని నిర్వహణ

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరణలో శాస్త్రీయత లోపించింది. తడి, పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియ సక్రమంగా సాగటం లేదు. కంపోస్టు తయారీ, పొడి చెత్తను ఆదాయంగా మార్చే ప్రక్రియ మొదలు కాలేదు. దీనికోసం టెండర్ ద్వారా కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించినా.. అతను పనులు చేపట్టకుండానే వెళ్లిపోయాడు. దీని వల్ల ప్రస్తుతం డంపింగ్ యార్డులో గుట్టలుగా చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. డంపింగ్ యార్డుకు వెళ్లే రోడ్డు సక్రమంగా లేక భారీ వర్షాలు వస్తే చెత్త వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో చెత్తను బయటే పారబోస్తున్నారు.

> **చర్యలు తీసుకుంటున్నాం**
>
> మున్సిపాలిటీలో చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. డంపింగ్ యార్డు పనులు దాదాపుగా పూర్తి కావొస్తున్నాయి. తడి, పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రజలకు చైతన్యం పెంపొందించే కార్యక్రమాలు చేపడతాం.
>
> – విద్యాధర్, మున్సిపల్ కమిషనర్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్



ఐక్యత చాటుతున్న నాయకులు

ఎస్సీ ఉపకులాలకు ప్రాధాన్యమివ్వాలి

దుబ్బాకటౌన్: ఎస్సీ ఉప కులాలకు ప్రాధాన్యమిస్తూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల నుంచి ఆరు చొప్పున స్థానాలు కేటాయించాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం మోచి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు పిన్నింటి దాసు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 22 లక్షల దళిత జనాభాలో 57శాతం ఉన్న ఎస్సీ ఉపకులాలకు చట్టసభల్లో ప్రాధాన్యమివ్వకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాల్లోనూ తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. దళిత బంధులో ఒక్క శాతం కూడా లబ్ధిచేకూరలేదని ఆరోపించారు. కుల ధ్రువీకరణ పత్రాలు ఆర్డీవో ద్వారా కాకుండా తహసీల్దార్ ఇచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. డిమాండ్లు పరిష్కరించకుంటే ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సత్యరాజ్, నాగరాజు, మహేష్, శ్రీనివాస్, రవి, రాజలింగం తదితరులు ఉన్నారు.

దుబ్బాక నియోజకవర్గ నూతన కమిటీ

ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి దుబ్బాక నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పానేటి స్వామి, ప్రధాన కార్యదర్శిగా బైరి బాల్‌నర్సు, ఉపాధ్యక్షుడిగా పిన్నింటి మధు, పస్తం సత్తయ్య, దాసరి అంజయ్య, ఓం ప్రకాశ్, నాంపల్లిని ఎన్నుకున్నారు.



సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

మెదక్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రెసిబెటరి ఇన్‌చార్జ్ శాంతయ్య దైవ సందేశం అందించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్చి నిర్వాహకులు వసతులు కల్పించారు.



వనదుర్గ దర్శనం ప్రారంభం

పాపన్నపేట(మెదక్): మంజీరా నది ఉధృతి తగ్గడంతో ఆదివారం ఏడుపాయల దుర్గాభవాని అమ్మవారి దర్శనం ప్రారంభమైంది. తెల్లవారుజామున ఆలయ పూజారులు ఎరుపు, చిలకపచ్చ వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఒడిబియ్యం పోసి, బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ముసురు పడుతుండటంతో భక్తుల సంఖ్య తక్కువగా ఉందని, ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈఓ సార శ్రీనివాస్ తెలిపారు.

వైభవంగా మూలమహోత్సవం



అమ్మవారి లక్ష పుష్పార్చనలో భక్తులు



విశేషాలంకరణలో వర్గల్ సరస్వతి అమ్మవారు

వర్గల్(గజ్వేల్): వర్గల్ శ్రీవిద్యా సరస్వతి క్షేత్రంలో ఆదివారం మూల మహోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. అమ్మవారి జన్మ నక్షత్రం సందర్భంగా ఆలయంలో నిర్వహించిన సామూహిక లక్ష పుష్పార్చనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తెల్లవారుజామున ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరసిద్ధాంతి పర్యవేక్షణలో అమ్మవారి మూలవిగ్రహానికి విశేష పంచామృతాభిషేకం జరిపారు. పట్టు వస్త్రాలు, పూలమాలలు, సర్వాభరణాలతో అమ్మవారిని అలంకరించారు. వేదపండిత పరివారం లలితాపారాయణం, సప్తశతీ, చండీ పారాయణం, చండీహోమం నిర్వహించారు. అదేవిధంగా చతుషష్ట్యోపచార పూజలు, కుంకుమార్చన జరిపారు.

కార్మికుల దీవెనలు ఉండాలి

ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటకమాన్: కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తానని, మీ దీవెనలు నాపై ఉండాలని ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని కొండ భూదేవి గార్డెన్‌లో భవన నిర్మాణ కార్మికుల బహిరంగ సభ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ప్రగతి ఏదైనా దానికి ఆధారం కార్మికులేనని అన్నారు. సిద్దిపేటలో కార్మిక భవనానికి ఎకరం స్థలం కేటాయిస్తున్నట్లు తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల కార్డు కోసం తన సొంత డబ్బులు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. డిజిటల్ కార్డు రెన్యువల్ గడువు ప్రభుత్వం పదేళ్లకు పెంచిందని తెలిపారు. రైతు బీమా తరహాలో కార్మిక బీమా అందించాలని నిర్ణయించినట్లు మంత్రి ప్రకటించారు. కార్మికుల బీమా రూ.లక్షన్నర నుంచి రూ.3లక్షలు పెంపునకు సీఎం కేసీఆర్‌తో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో కార్మికులకు రూ.5లక్షల వరకు ఉచితంగా ఆరోగ్య శ్రీ వైద్య సేవలు, కేన్సర్, గుండె, కిడ్నీ, లివర్ వంటి చికిత్సలకు రూ.10లక్షల వరకు ఉచిత వైద్య సేవలు వచ్చే నెల నుంచి అమలు కాబోతున్నాయన్నారు. తెలంగాణకు ఒక్క రూపాయి కూడా ఇవ్వనన్న కిరణ్‌కుమార్‌రెడ్డిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆహ్వానించడమేమిటని ప్రశ్నించారు. అదేవిధంగా ఉచిత కరెంట్ వద్దన్న రేవంత్‌రెడ్డి.. చంద్రబాబును గురువు అని చెప్పుకోవడంపై ప్రజలే ఆలోచించాలని అన్నారు. సభలో మల్లారెడ్డి, హరీశ్‌రావు ఫోన్ సంభాషణలు నవ్వులు పూయించాయి. జిల్లాకో కార్మిక భవన్‌ను మంజూరు చేస్తున్నట్లు కార్మిక మంత్రి ఫోన్‌లో ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పారుఖ్‌హుస్సేన్, కొండం సంపత్‌రెడ్డి, మారెడ్డి రవీందర్‌రెడ్డి, మచ్చ విజిత, శ్రీశైలం, సత్యం, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

పొరుగు రాష్ట్రాలకు చేపలు

సిద్దిపేటజోన్: పొరుగు రాష్ట్రాలకు తెలంగాణ చేపలు ఎగుమతి అవుతున్నాయని, కాళేశ్వరం వల్లే ఇది సాధ్యమైందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మచ్చ విజిత, వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మత్స్యకారులు మంత్రిని కలిశారు. సిద్దిపేటలోని రంగనాయక సాగర్, నియోజకవర్గంలోని పలు చెరువుల్లో పట్టిన చేపలను పశ్చిమబెంగాల్- కలకత్తా, మహారాష్ట్రలోని చంద్రాపూర్, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, రాజమండ్రి, కాకినాడకు ఎగుమతి అవుతున్నాయని మంత్రి అన్నారు.

చెట్టు–బొట్టు కార్యక్రమం..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఇంటి పరిసరాలు, వీధులు శుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని మంత్రి సూచించారు. ఆదివారం సిద్దిపేట మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో చెట్టు-బొట్టు (మొక్కల పంపిణీ) కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వివిధ వార్డులలో ఆయా కౌన్సిలర్‌లు, ప్రజాప్రతినిధులు మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కులవృత్తులను ప్రోత్సహించేందుకే..

కులవృత్తులను ప్రోత్సహించేందుకే బీసీ బంధు ప్రవేశ పెట్టినట్లు మంత్రి పేర్కొన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో బీసీబంధు కోసం 12వేల దరఖాస్తులు రాగా, మొదటి విడతలో 300 మంది లబ్ధిదారులకు లక్ష రూపాయల చెక్కులు అందించారు. వారం రోజుల్లో సిద్దిపేటకు డిగ్రీ బీసీ (మహిళ) రెసిడెన్షియల్ గురుకులం రాబోతుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ పాల్గొన్నారు.



చేపలతో మంత్రి హరీశ్



గంగిరేణి చెట్టు వద్ద భక్తుల సందడి

మల్లన్న క్షేత్రంలో భక్తుల కిటకిట

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని సుమారు 8వేల మంది దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఉదయం నుంచి స్వామివారి దర్శనానికి భక్తులు బారులు దీరారు. అభిషేకాలు, పటాలు, ఒడిబియ్యం, అర్చనలు, కేశఖండన, గంగిరేణి చెట్టుకు ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా రేణుక ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పించారు. ఆలయం వద్ద ఏర్పాట్లను ఏఈఓలు అంజయ్య, శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్ పర్యవేక్షించారు.

ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు



పార్టీ కండువాలు కప్పుతున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని సీఎం మినీ క్యాంపు కార్యాలయంలో జగదేవ్‌పూర్ మండలం వట్టిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ జనరంజక పాలనకు ఆకర్శితులై వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జగదేవ్‌పూర్ మండల సహకార సంఘం చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు పనగట్ల శ్రీనివాస్‌గౌడ్, గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సాయుధ పోరాట యోధుడి కన్నుమూత


రామనాథం

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లికి చెందిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కాసోజు రామనాథం(90) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతిచెందాడు. రజాకారులకు వ్యతిరేకంగా బైరాన్‌పల్లిలో జరిగిన పోరాటంలో పాల్గొన్నందుకుగాను రామనాథానికి భారత ప్రభుత్వం సమర యోధుల పెన్షన్ మంజూరు చేసింది. ఆయన మృతికి గ్రామస్తులు సంతాపం తెలిపారు. ఆయనకు భార్య సిద్దమ్మ, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు.

విద్యుత్ సిబ్బందిపై ఫిర్యాదు

మద్దూరు(హుస్నాబాద్): విద్యుత్ సిబ్బందిపై ఆదివారం మండలంలోని వల్లంపట్ల ఎస్‌ఎస్-1ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని 16 మంది రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, ఎస్ఎస్-1 ట్రాన్స్‌ఫార్మర్‌లో ఇటీవల సాంకేతిక సమస్య కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. దీనిని సరిచేయాలని లైన్ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్‌లకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో తామంతా విద్యుత్ శాఖ ఏఈకి ఫోన్‌లో వారిపై ఫిర్యాదు చేశామన్నారు. అయితే తమపైనే ఉన్నతాధికారికి ఫిర్యాదు చేస్తామని చెప్పిన సదరు సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్‌లు తొలగించినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఓ వైపు వరినాటు వేసే సమయం, మరో వైపు విద్యుత్ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్‌లు తీసుకెళ్లి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఈ విషయమై ఏఈ సుధీర్‌బాబును వివరణ కోరగా, ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్య వల్ల.. ఫ్యూజ్‌లు ఉండడంలేదని, ఆ కారణంగా సబ్ స్టేషన్‌లో ట్రిప్ అవుతోందన్నారు. పాడైన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో మరొకటి వెంటనే ఏర్పాటు చేస్తామన్నారు.

విద్యుదాఘాతానికి పాడిగేదె మృతి


గేదె కళేబరం

అల్లాదుర్గం(మెదక్): విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతిచెందింది. ఈ సంఘటన మండలంలోని గొల్లకుంట తండాలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు శ్రీను తెలిపిన వివరాలిలా.. ఉదయం కొష్టం నుంచి పాడిగేదెను వదిలిపెట్టడంతో మేసుకుంటూ వెళ్లింది. గ్రామ శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్లగానే షాక్ గురై అక్కడికక్కడే మృతిచెందింది. రూ. 50 వేల విలువ ఉంటుందని, అధికారులు ఆదుకోవాలని బాధితుడు కోరారు.

మున్సిపాలిటీలో విలీనం చేయొద్దు


ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ శివారు గ్రామం పోతారం(ఎస్), పందిల్ల, గాంధీనగర్ గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయాలని అధికారులు ప్రతిపాదించడంతో గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేపట్టారు. మున్సిపాలిటీలో కలిపితే పన్నుల భారంతో పాటు ఇంటి అనుమతికి భారమవుతుందన్నారు. అలాగే ఉపాధిహామీ కూలీలకు పని దొరకకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ఆయా గ్రామాల ప్రతినిధులతో చర్చించారు. ఐటీసీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ ఉన్న కిషన్‌నగర్ పరిధి వరకే మున్సిపాలిటీలో విలీనం చేయనున్నట్లు చెప్పారు.

కాటు వేసే కాలం

సర్పాలు, విషపురుగులతో జాగ్రత్త
- పొలాల్లో పొంచి ఉన్న ప్రమాదం

వర్షాకాలంలో విషసర్పాలు, పురుగులు సంచారం అధికంగా ఉంటోంది. అవి పెట్రోల్, కిరోసిన్, వెల్లుల్లి, ఇంగువ వాసనలను భరించలేవు. వీటిని అందుబాటులో ఉంచుకొని సమయానుకూలంగా వినియోగించాలి. తప్పనిసరి పరిస్థితులు ఎదురైతే రబ్బరు బూట్లు, చేతి తొడుగులు ధరించాలని, మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని టేక్మాల్ పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ శాలిని తెలిపారు. దీనిపై కథనం


శివారులో పొలాల వద్ద పాము (ఫైల్)

టేక్మాల్(మెదక్): పొలంగట్లు, కాలువగట్లు, వాగులు, పశువుల పాకలు, పిచ్చిమొక్కలతో నిండిన పొదలు, గడ్డి వాములు, పాడుబడ్డ ఇళ్లు, గృహాల ఎదుట పేర్చిన కట్టెలు, పెంటకుప్పల్లో పాములు ఎక్కువగా తిరుగుతుంటాయి. ఆహారం కోసం బయటకొచ్చి ఎలుకలు, బల్లులు, తొండలు, పక్షులను తింటాయి. ఇలాంటి ప్రాణులు ఎక్కడ ఎక్కువగా సంచరిస్తాయో పాములు అక్కడ తిష్ట వేస్తాయి. పాములకు శరీరం కింది భాగంలో ఉండే ప్రత్యేక పొలుసుల ద్వారా శబ్దం గ్రహిస్తాయి. వేడిరక్తం ప్రసవించే, జంతువులు, మనుషులు సమిపిస్తే వెంటనే గుర్తిస్తాయి. కదులుతున్న ప్రాణులను గుర్తించి కాటేస్తాయి. నాగుపాము, కట్ల పాము, రక్తపింజర తదితర పాములు విషపూరితమైనవి. వీటి కాటుకు గురైనా బాధితులకు వెంటనే వైద్యమందక ఒక్కోసారి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. సాధారణంగా పంట పొలాలు, కాలువల్లో తిరిగే పాములు చాలా వరకు విషపూరితమైనవి కావు. సర్పాలకు ప్రాణభయం ఉన్నప్పుడు ఏకాంతానికి భంగం వాటిల్లినప్పుడు, ఎవరైనా తొక్కినప్పుడు, వేటాడేటప్పుడు కాటేస్తాయి.

అన్ని ప్రమాదం కాదు..

పాముల్లో చాలా వాటికి విషం ఉండదు. తాచు. కట్ల పాము వంటి 15 శాతం ప్రమాదకరమైన సర్ప జాతుల్లోనే ప్రమాదముంటోంది. సాధారణంగా 50 శాతం పాముకాట్లు విషం, ప్రమాదంలేని మాములు గాయాలే. చికిత్స తీసుకుంటే నయమవుతాయి. పాముల కన్నా చాలా మంది షాక్‌తో ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారు. ఇంట్లో వారు. ఇరుగుపొరుగు వారు ధైర్యం చెప్పడానికి బదులుగా ఏడుపులు ప్రారంభిస్తే బాధితులు భయాంతోళనకు గురైతే పరిస్థితి మరింత ప్రమాదకరంగా తయారవుతోంది.

పాములు వాటి విషప్రభావం

కట్లపాము: ఇది కాటేసిన క్షణాల్లోనే విషంరక్త కణాల్లో కలుస్తోంది. వెంటనే ఆస్పత్రిలోచేర్పించాలి.

నాగుపాము: ఇది కాటేసిన 15 నిమిషాల్లోనే శరీరంలోకి విషం ఎక్కుతోంది.

రక్తపింజర: ఇది కాటేసిన 2 గంటల తర్వాత విషం ఎక్కుతోంది.

జిర్రిపోతు, నీరుకట్ట : ఇవి కాటేసిన విషం ఉండదు. కాటు వేసిన చోట చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకువెళ్లడం ఉత్తమం.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

రాత్రివేళల్లో తిరిగేవాళ్లు, అక్కడే నిద్రించేవాళ్లు టార్చ్‌లైట్‌ను వెంట తీసుకుపోవాలి. పాములు చేరడానికి అవకాశం లేకుండా పరిసరాలు ఎప్పటికప్పుడూ శుభ్రం చేసుకోవాలి. పెట్రోల్, కిరోసిన్, వెల్లుల్లి, ఇంగువ వాసనలను భరించలేవు. పాములు ఎక్కువగా ఉన్నాయనిపిస్తే సమయానుకూలంగా వీటిని ఉపయోగించుకోవాలి. రాత్రి వేళల్లో పొలాల గట్లపై, గడ్డివాముల్లో తిరిగే రైతులు, కూలీలు మోకాళ్ల వరకు రబ్బరు బూట్లు, చేతులకు రబ్బరు తొడుగులు ధరించాలి. ఇళ్లు, కార్యాలయాలు, పాఠశాలలు పరిసరాలల్లో పిచ్చిమొక్కలు, పొదలు ఉండకుండా చూసుకోవాలి.

సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లాలి



పాముకాటుకు గురై వ్యక్తి ఆందోళన చెందొద్దు. పక్కవారు బాధితుడికి ధైర్యం చెబుతుండాలి. పాముకాటేసిన పైభాగంలో వెంటనే తాడు, గుడ్డతో బిగుతుగా కట్టాలి. కాటేసిన చోట బ్లేడు గాయం చేసి రక్తం కారనివ్వాలి. నోటిలో పుండ్లు, గాట్లు లేకుంటే రక్తం పీల్చి ఉమ్మివేయాలి. పాముకాటుకు గురైనా వ్యక్తిని నడిపించడం, పరిగెత్తించడం చేయొద్దు. నాటువైద్యం పేరిట పసర్లు, వేర్లు, మంత్రాలు అంటూ కాలయాపన చేయకుండా వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలి.

– డాక్టర్ శాలిని, పీహెచ్‌సీ టేక్మాల్

వైద్యశిబిరాలతో పేదలకు లబ్ధి

తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న భిక్షపతి

వట్‌పల్లి(అందోల్): స్వచ్ఛంద సంస్థల ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో ప్రయోజనకరమని తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా పర్తి(పుట్టపర్తి) యాత్ర సందర్భంగా జిల్లా సత్యసేవా సంస్థలు, యువజన విభాగం ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని మర్వెల్లిలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించి, సత్యసాయి సేవా సమితి సభ్యులను అభినందించారు. హైదరాబాద్‌కు చెందిన సత్యసాయి భక్తమండలి సభ్యులు, డాక్టర్‌లు రంగనాథ్, డాక్టర్ అచ్చుత్ రెడ్డి, సంగమేశ్వర్, డాక్టర్ విఠల్‌రావు.. 153 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే 40 మంది టెన్త్ విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్‌లు, నోట్‌బుక్స్, పెన్నులు, 70 ఏళ్లు నిండిన ఏడుగురు వృద్ధ దంపతులకు నూతన వస్త్రాలు అందించి సన్మానించారు. గ్రామానికి చెందిన 9 మందికి అమృత కలశాలు, 10 మందికి గొడుగులు, 30 మందికి రెయిన్ క్యాప్స్‌లు, 18 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అలాగే వెటర్నరీ క్యాంపులో 90 పశువులకు డాక్టర్ నాగన్న వైద్యపరీక్షలు నిర్వహించి, సునకాలకు వ్యాక్సిన్ వేశారు. అనంతరం యువతీ యువకులకు క్రీడలు నిర్వహించి, ఆపై ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటారు. తొలుత గ్రామానికి చెందిన ఒగ్గు సాయమ్మ, సింగూరు బాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం బాధిత కుటుంబాలను పరామర్శించి, ఆర్థికసాయాన్ని అందజేశారు. ఇటీవల కురిసిన వర్షానికి బేగరి కిష్టమ్మ ఇల్లు దెబ్బతినగా ఆమెకూ ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శోభారాణి, ఎంపీటీసీ సంగన్న , జోగిపేట, వట్‌పల్లి సత్యసాయి సేవా సమితి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మోటారు స్టార్టర్ తీస్తుండగా..

ప్రమాదవశాత్తు నీటమునిగి రైతు మృతి


చిన్నకృష్ణయ్య

చేర్యాల(సిద్దిపేట): నీట మునిగిన మోటారు స్టార్టర్‌ను బయటికి తీస్తుండగా ప్రమాదవశాత్తు రైతు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన పట్టణకేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని వెలుగలకాలనీకి చెందిన వెలుగల చిన్న కృష్ణయ్య(57) తన బోరు మోటారు స్టార్టర్ ఇటీవల కురిసిన వర్షాలకు నీటిలో మునిగింది. ఆదివారం స్టార్టర్ బయటికి తీస్తుండగా కాలు జారీ వెనుకకు పడి నీటిలో పడి మునిగి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుడి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ చేర్యాల మండల అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, కొమ్ము నర్సింగరావుతో కలిసి పరామర్శించారు.

ఊరచెరువు దాటి.. అంత్యక్రియలు చేసి..


పాడెతో ఊరచెరువును దాటుతున్న గ్రామస్తులు

సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌లో ఉదంతం

గజ్వేల్: గ్రామంలోని ఊరచెరువు దాటుకొని వెళ్లి ఓ వృద్ధుడి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ హృదయవిదారకర సంఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో ఆదివారం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన ఎస్. మల్లయ్య (70)అనే వృద్ధుడు అనారోగ్యంతో తెల్లవారుజాము చనిపోయాడు. మృతదేహానికి ప్రజ్ఞాపూర్‌లో ఉన్న ఊర చెరువు పైభాగంలో దహన సంస్కారాలు నిర్వహించాల్సి ఉంది. ఇటీవల వర్షాలకు ఈ చెరువు పొంగి పొర్లుతోంది. సాయంత్రం కుటుంబీకులు, బంధువులు నీటి ప్రవాహంలోనే చెరువును దాటుకుంటూ వెళ్లి అంత్యక్రియలు చేశారు.

రంగుమారిన 'భగీరథ' నీరు


కొమురవెల్లిలో రంగు మారిన నీరు

కొమురవెల్లి(సిద్దిపేట): మూడు, నాలుగు రోజుల నుంచి మండలకేంద్రంలో మిషన్ భగీరథ నీరు రంగుమారి సరఫరా అవుతోంది. కురుస్తున్న వర్షాలకు తోడు ఈ నీటిని తాగితే ఆస్పత్రి పాలవడం ఖాయమని ప్రజలు అంటున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కలుషిత నీరు సరఫరా అవుతోంది. దీంతో ప్రజల ప్రైవేటు ప్లాంట్ల వైపు పరుగులు తీస్తున్నారు. ఈ విషయమై మిషన్ భగీరథ ఏఈ లక్ష్మిని వివరణ కోరగా, వర్షం కారణంగా నీరు రంగు మారాయని, అయితే ఫిల్టర్ అవుతున్నాయని, ప్రజలు కాచి చల్లార్చిన తర్వాతనే తాగాలన్నారు.

మరికొందరికి వాంతులు, విరేచనాలు

దుబ్బాకరూరల్: మండలంలోని బల్వంతాపూర్, దుంపలపల్లి, నర్లెంగడ్డ, పద్మశాలి గడ్డలో వైద్యశిబిరాలు కొనసాగుతున్నాయి. దుంపలపల్లిలో ముగ్గురికి, బల్వంతాపూర్‌లో ఇద్దరికి వాంతులు, విరేచనాలు కావడంతో అంబులెన్స్‌లో దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఐదుగురికి వైద్య శిబిరం వద్దే చికిత్స అందించారు. ప్రస్తుతానికి ఆస్పత్రిలో 31 మందే ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నారు.

పెద్దాపూర్‌లో దొంగల బీభత్సం

- శనివారం అర్ధరాత్రి ఓ ఇంట్లో చొరబాటు
- కత్తులు, కర్రల దాడిలో తండ్రీకొడుకులకు గాయాలు
- బెదిరించి బంగారం, వెండి సొత్తు తస్కరణ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని పెద్దాపూర్‌లో శనివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. ఓ ఇంటిలో చొరబడి బెదిరించి విలువైన వస్తువులు తస్కరించుకుపోయారు. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మునిపల్లి మండలంలోని పెద్దారెడ్డిపేట్‌కు చెందిన రాయిపాటి మల్లేశం(48) తన కుటుంబ సభ్యులతో కలిసి పెద్దాపూర్‌కు ఉపాధి కోసం వలసొచ్చాడు. గ్రామంలోనే తన కుటుంబంతో కలిసి అద్దెకు నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి మూత్రవిసర్జనకు రాయిపాటి మల్లేశం లేచి తలుపులు తీసి బయటకువచ్చాడు. ముందు నుంచి చొరబడిన దొంగలు కత్తులు, కట్టెలతో చేసిన దాడిలో మల్లేశంకు ఎడమ చేయి విరిగిపోయింది. అతడి పెద్ద కుమారుడు పాండు(20)చెవికి గాయమైంది. అయితే మల్లేశం భార్య, మరో ఇద్దరు కుమారులు భయాందోళన వ్యక్తం చేశారు. దుండగులు అందరినీ బెదిరించి రూ.30వేల నగదు, 3 తులాల బంగారం, 16 తులాల వెండి ఎత్తుకెళ్లినట్లు మల్లేశం తెలిపారు. ఆదివారం బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ నవీన్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న రాములు

సంగారెడ్డి టౌన్ : భారీ వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతాంగాన్ని, ఇళ్లు కూలి నిరాశ్రయులైన పేదలకు గృహాలు నిర్మించి ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు చుక్క రాములు అన్నారు. ఆదివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ భారీ వర్షాలు కురియడంతో వేలాది ఎకరాల్లో నీరు చేరి పంటలు పూర్తిగా పాడయ్యాయని అన్నారు. పంట పొలాల్లో నీరు నిలిచి, వరద ధాటికి పంటలు కొట్టుకుపోయాయని అన్నారు. అధికారులు పరిశీలనకు వెళ్లి నష్టం అంచనా లెక్కకట్టాలని డిమాండ్ చేశారు. భారీ వర్షాలతో అనేకచోట్ల ఇళ్లు కూలి నిరాశ్రయులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా సరైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సహాయ కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు, ప్రజలకు అండగా ఉండాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు కార్యదర్శివర్గసభ్యుడు బి.మల్లేశం, కే.రాజయ్య జి. సాయిలు, ఎన్.నరసింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు

బురదరోడ్డుపై వరినాట్లతో నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న తండావాసులు

శివ్వంపేట(నర్సాపూర్): బురద రోడ్డు సమస్య పరిష్కరించాలని తండావాసులు ఆదివారం వరినాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తండావాసులు మాట్లాడుతూ, బోజ్య పంచాయతీ జెగ్యా తండా రోడ్డు బురదమయంగా ఉందని, రాకపోకలకు తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. రోడ్డు బాగు చేయాలని పలుమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని కోరుతున్నారు.

వేర్వేరుచోట్ల నలుగురి ఆత్మహత్య

వేర్వేరు చోట్ల నలుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. మొగుడంపల్లి, గుమ్మడిదల, రాంసాగర్, మెదక్‌లో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం..

బావిలో దూకి యువకుడి ..


అభిషేక్

జహీరాబాద్ టౌన్: కుటుంబసభ్యుల గొడవలో యువకుడు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మొగుడంపల్లి మండలంలోని గౌటిగార్‌పల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గొల్ల నెళ్వాల్ కాశీనాథ్‌కు ముగ్గురు కొడుకులు. అందరిలో చిన్నవాడైన నెళ్వాల్ అభిషేక్(18) వ్యవసాయ పనులు చేసుకునేవాడు. తాగుడుకు బానిసై తరుచూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఆదివారమూ మద్యంతాగి కుటుంబ సభ్యులుతో ఘర్షణపడ్డాడు. కుటుంబ సభ్యులు గట్టిగా మందలించడంతో మద్యంమత్తులో గ్రామానికి సమీపంలో నారాయణ వ్యవసాయ పొలంలో గల ఓపెన్ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొడుకు ప్రమాదవశాత్తు కాలు జారీ బావిలో పడి మృతిచెందాడని తండ్రి కాశీనాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చిరాగ్‌పల్లి ఎస్ఐ. నరేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..

జిన్నారం(పటాన్‌చెరు): భార్య కాపురానికి రావటం లేదని మనస్తాపం చెందిన భర్త పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గుమ్మడిదలలో జరిగింది. గుమ్మడిదల ఎస్ఐ లక్ష్మారెడ్డి కథనం ప్రకారం.. శివ్వంపేట మండలం గుండ్లపల్లికి చెందిన ప్రేమలతకు గుమ్మడిదల గ్రామానికి చెందిన పరమేశ్(28)తో 4 నెలల క్రితం వివాహమైంది. నెల రోజులపాటు వీరి సంసారం సాఫీగా జరిగింది. కాగా ప్రేమలత తన పుట్టింటికి తరచుగా వెళ్తుండేది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య గొడవలు జరిగేవి. పుట్టింటికి వెళ్లిన ఆమె ఎంతకీ తిరిగి రాకపోవటంతో మనస్తాపానికి గురైన పరమేశ్ ఈనెల 10న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన తల్లిదండ్రులు అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం గుండెపోటు రావటంతో మరణించాడు. మృతుడి తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు ఎస్ఐ లక్ష్మారెడ్డి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యం కుంగదీసింది...

రాయపోలు(దుబ్బాక): భార్యాభర్తలిద్దరూ పక్షవాతంతో మంచానపడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. రాయపోలు ఎస్సై మహబూబ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంసాగర్‌కు చెందిన రాగి సత్తయ్య (65) వ్యవసాయ చేసుకునేవాడు. ఆమె భార్య లక్ష్మి రెండేళ్ల క్రితం పక్షవాతం బారిన పడి మంచానికే పరిమితమైంది. గతేడాది సత్తయ్య కూడా పక్షవాతానికే గురయ్యాడు. ఇద్దరూ మంచాన పడడంతో వారి పరిస్థితి దారుణంగా మారింది. ఇద్దరు కొడుకులు వేర్వేరుగా ఉండడంతో మంచాన పడ్డ ఇద్దరు కొంతకాలంగా బాగా కుంగిపోతున్నారు. సత్తయ్యకు కొంతనయమైనప్పటికీ భార్య మంచంవీడడం లేదు. దీంతో మనస్తాపానికి గురైన సత్తయ్య ఈనెల 25న పురుగుల మందు తాగాడు. గమనించిన అతడి చిన్నకొడుకు గజ్వేల్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు లక్ష్మక్కపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించాడు. అక్కడ చికిత్సపొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. మృతుడి పెద్దకొడుకు బాలరాజు ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.


సత్తయ్య

నిండు ప్రాణాన్ని బలిగొన్న అప్పులు

మెదక్ మున్సిపాలిటీ: ఒక వైపు పనిదొరకక, మరోవైపు కూతురు వివాహానికి చేసిన అప్పులతో మనోవేదనకు గురైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి మెదక్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని పిట్లంబేస్ వీధికి చెందిన మోయిగారి పాండు(53) వడ్రంగి పనిచేసునేవాడు. మృతుడికి భార్య జగదాంబతోపాటు కొడుకు సంతోష్, కూతురు సమంత ఉన్నారు. 6 నెలల క్రితం కూతురు పెళ్లి చేశాడు. ఆ సమయంలో పలువురి వద్ద అప్పులు చేశారు. పాండుకు ఇటీవల పని దొరకడం కష్టంగా మారింది. దీంతో అప్పులకు వడ్డీలు కట్టలేక, వాటిని తీర్చే మార్గం కనబడక మనోవేదనకు గురవుతున్నాడు. శనివారం రాత్రి తన ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు ఇంట్లోకి వెళ్లి చూసేసరికి పాండు విగతజీవిగా కనిపించాడు. అనంతరం వారు పోలీసులకు సమాచారం అందించగా పట్టణ సీఐ వెంకటేశ్ సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మోయిగారి పాండు మృతదేహం

అప్పుడు వడగండ్లు.. ఇప్పుడు భారీ వర్షం

- రూ. 8 లక్షల అప్పులు తీర్చలేక ఉరేసుకున్న రైతు
- దుంపలపల్లిలో ఘటన


భిక్షపతి

దుబ్బాక: అప్పుల బాధతో మనస్తాపానికి గురై ఓ రైతు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి వార్డులో ఆదివారం జరిగింది. దుబ్బాక ఎస్సై గంగరాజు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దుంపలపల్లి వార్డుకు చెందిన కుక్కల భిక్షపతి(45) అనే రైతు చింతలకుంట వద్ద తనకున్న 5 ఎకరాల్లో వ్యవసాయం చేసుకునేవాడు. భిక్షపతి తన పిల్లల పెళ్లిళ్ల కోసం.. ఇటీవల పాత ఇంటి మరమ్మతు కోసం సుమారు రూ. 3 లక్షలు, 2018లో ఎస్సీ కార్పొరేషన్ కింద స్వరాజ్ ట్రాక్టర్ కొనడానికి బంధువుల వద్ద సుమారు రూ. 5 లక్షల అప్పు చేశాడు. ట్రాక్టర్ లోన్ 6 నెలలకోసారి రూ.78 వేల కిస్తీలు కట్టలేక తరుచూ సతమతం అయ్యేవాడు. అయితే యాసంగిలో వడగండ్ల వానకు 5 ఎకరాల్లో సాగుచేసిన వరిపంట నష్టపోయాడు. ఇటీవల కురిసిన వర్షానికి 3 ఎకరాల భూమి నీట మునిగింది. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక లోలోన మదన పడుతుండేవాడు. ఆదివారం ఉదయం మిగిలిన 2 ఎకరాల వరి పంటకు గడ్డి మందు చల్లుతానని ఇంట్లో చెప్పి పొలంలోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవపంచనామా నిర్వహించారు. మృతుడికి భార్య లక్ష్మి , ఇద్దరు కొడుకులు నర్సింలు, విజయ్, కుమార్తె నవ్య ఉన్నారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.